# పంజరాల్లో కుందేళ్లు

బడిలేని రోజు పసిపిల్లల చెవులు
హాస్టలు గేటుని అంటుకునుంటాయి
గేటు చప్పుడుకు తమ వారైతే
హర్షాతిరేకంతో హత్తుకు పోతాయి
వారు తెచ్చిన ప్రేమ పొట్లాలతో
వారి చుట్టూ గంతులేస్తూ
చుట్టూ వున్న ప్రపంచాన్ని మర్చిపోతాయి
రానివారి కోసం చూసిన కళ్లు
వచ్చి వెళ్లిన వారిని
కనుమరుగయేవరకూ చూసిన కళ్లు
అలసిపోయే వరకూ ఆగకుండా వర్షిస్తూనే ఉంటాయి
అమ్మ తీయతీయని ముద్దుల రుచుల్నించి
సుతిమెత్తని ఒడిలోని మత్తునించి
కళ్లల్లోని ప్రేమానురాగాల రసాల్నించి
దూరంగా క్రూరంగా
ఏ తప్పుకు శిక్షగానో ఇక్కడ –
ఇంటి దగ్గర వీరి
పేచీలకీ ఏడుపులకీ
మందులకీ మాకులకీ
స్వయంగా తప్పించుకునే తరుణోపాయంగా ఇక్కడ
బరువనుకున్నదాన్ని తగ్గించుకుని
బాధ్యత నెరవేర్చుకుందుకు ఇక్కడ
అందుకే కదా అంత సజావుగా
కిరాణా కొట్టుల్లా, కిళ్లీ బడ్డీల్లా వీధివీధికీ
హాస్టళ్లు ప్లస్కూళ్లు ఈక్వల్టు వ్యాపారం

దానికి ప్రతిఫలంగానే ఇక్కడ
అవును నిజంగానే ఇక్కడ
ప్రతి చిన్నదానికి అమ్మ దగ్గర మారాంచేసి సాధించి ఆనందించే
అందాల పసిడి మొగ్గలు
రాబోయే జైలు జీవితానికి అలవాటు పడతాయి
నోరు విప్పటానికి భయపడటం
ఎవరో ఒకరి మీద ఆధారపడటం
తోటివారి సంతోషాన్ని చూసి అసూయపడటం
నిశ్శబ్దంగా ఏడవటం అలవర్చుకుంటాయి
ఏడుస్తూ ఏడుస్తూ అమ్మనే కలలుకంటూ
నిద్రలోనే నిస్సత్తువుగా పెరుగుతుంటాయి.